రెండోరోజు ఎంఈఓ-2 పోస్టుల భర్తీ కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా మిగిలి పోయిన ఎంఈఓ-2 పోస్టుల భర్తీకి సంబంధించి సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్, దేవరాజు, సూపరింటెండెంట్ బాదుల్లా పాల్గొన్నారు. జిల్లాలో మొదటిరోజు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో మిగిలిన 30 పోస్టులను సోమవారం కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు.



దస్తగిరి అరాచకం

- పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు
- పులివెందులలో కేసు నమోదు

కడప అర్బన్ : మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన షేక్ దస్తగిరి చేస్తున్న అరాచకాలలో మరో సంఘటన పులివెందుల పట్టణంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనపై బాధితురాలు షేక్ గులాబి పులివెందుల అర్బన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. 'నేను నా భర్త గుగూడు వల్లితో కలసి పులివెందుల టౌన్ భాకరాపురం, జయమ్మకాలనీలో ఉంటున్నాం. నా భర్త ట్రాక్టర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నా భర్త మొదటి భార్య 9 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. నన్ను 8 ఏళ్ల క్రితం గుగూడు వల్లి రెండో వివాహం చేసుకున్నాడు. అయితే మొదటి భార్యకు గూగుడు వల్లి(16), రేష్మా (15) సంతానం కాగా.. నాకు గుగూడు వల్లికి ఇమ్రాన్, చాందినీ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరం కలసి ఉంటున్నాం. అయితే మా కుటుంబ అవసరాల నిమిత్తం మా ఇంటి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ దస్తగిరి దగ్గర ఆరు నెలల క్రితం రూ. 40 వేలు అప్పుగా తీసుకున్నాం. పూచీకత్తుగా ఇంటి పత్రాలను ఇచ్చాము. తరువాత బాకీ డబ్బుకు వడ్డీగా వారానికి రూ. 4 వేలు చొప్పున దస్తగిరికి ఇస్తూ వస్తున్నాం. తర్వాత మధ్యలో కొన్ని వారాలు మేము వడ్డీ కట్టలేకపోయాం. దీంతో అసలుకు వడ్డీతో కలిపి రూ.1,10,000 మాతో ప్రామిసరీ నోటు దస్తగిరి రాయించుకున్నాడు. కాగా డబ్బు ఇవ్వాలని నా భర్తను ఒత్తిడి చేస్తూ వస్తున్నాడు. ఈ నెల 13న డబ్బు చెల్లిస్తామని చెప్పాం.. అయితే సర్దుబాటు కాక చెల్లించలేదు. ఈ క్రమంలో ఈ నెల 17న నేను, నా భర్తతో కలసి బంధువుల ఇంటికి వెళ్లాం. 18వ తేదీ సాయంత్రం దస్తగిరి మాకు ఫోన్ చేసి డబ్బు చెల్లించకుండా ఇంటి నుంచి పారిపోయారు.. మీ కుమారుడు గూగుడు వల్లిని నిర్బంధించాను. డబ్బు చెల్లించి మీ కొడుకును తీసుకెళ్లండి.. లేకపోతే మీ కొడుకును కొడతాం.. అని బెదిరించాడు. నా కొడుకుతో ఫోన్‌లో మాట్లాడించాడు. 'నన్ను దస్తగిరి కొడుతున్నాడు..' అని మా కొడుకు బాధ పడుతున్నాడని.. పైగా దస్తగిరి భార్య షబానా కూడా ఫోన్ చేసి మీ కొడుకుకు ఇప్పటికే ఉదయం.. సాయంత్రం ఒక కోటింగ్ అయిపోందని.. నువ్వు వచ్చి మాట్లాడకపోతే నీ కొడుకు మా చేతిలో చచ్చిపోతాడని బెదిరిస్తున్నారు. నా కుమారుడిని వారు ఏమైనా చేస్తారేమోనని భయంగా ఉంది సార్.. దస్తగిరి, అతని భార్య షబానాపై చర్యలు తీసుకుని, మా కుమారుడిని అప్పగించండి.. సార్.. అంటూ' గులాబి పోలీసులను వేడుకుంది. ఈ మేరకు పులివెందుల అర్బన్ పోలీసులు దస్తగిరిపై కేసు నమోదు చేశారు.

జులై 1నుంచి జగనన్న సురక్ష

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి ఆ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఎవరెవరికి ప్రభుత్వ పథకాలు అందడం లేదో గుర్తించాలన్నారు. అలాగే జనన, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలు ఎవరెవరికి అవసరమో జాబితా తయారు చేయాలన్నారు. జులై 1 నుంచి ఆగస్టు 1 వరకు సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసే క్యాంపులకు వారిని తీసుకు రావాలన్నారు. క్యాంపులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లోలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

సుస్థిర అభివృద్ధిపై శ్రద్ధ

సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పేదలందరికీ ఇల్లు పథకాన్ని నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తి చేయాలని చెప్పారు. హౌసింగ్ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు సక్రమంగా జరగడం లేదని, ఇకపై వంద శాతం నమోదు కావాలని ఆదేశించారు.

ఓటర్ల జాబితా సవరణ

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. కొత్తగా ఓటు నమోదుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18–19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్‌జెండర్లు, నిరాశ్రయుల జాబితా తయారీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నగర పాలక్ష కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో వినతులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేయాలన్నారు. జేసీ గణేష్‌కుమార్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

24న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు రాక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 24న కడప నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించే జిల్లా అసెంబ్లీ సమన్వయ కమిటీ సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు నజీర్ అహ్మద్, బండి జకరయ్య తెలిపారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమన్నారు. బీజేపీ పాలనలో ఈడీ, సీబీఐ, ఎన్ఐఏ వంటి రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ వస్తారన్నారు.

జిల్లా ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

- ప్రాధాన్యత పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- యురేనియం కార్పొరేషన్ పరిధిలోని భూములకు సాగునీరు
- జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పనుల పురోగతిపై ఆరా

కడప సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జల వనరులశాఖపై సీఎం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి, జల వనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఈఎన్ సీసీ నారాయణరెడ్డి, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రధానంగా ఈ సమీక్షలో వైఎస్సార్ జిల్లాకు సంబంధించి నీటి పారుదల ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ప్రాధాన్యత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రాజెక్టుల సీఈ హరినారాయణరెడ్డి, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డిలను ఆదేశించారు. ఈ సమీక్షలో జీఎన్ఎస్ఎస్ ఫేస్–1, 2, 3 పనులకు సంబంధించి (మెయిన్ కెనాల్) ప్రారంభం నుంచి కోడూరు వరకు జరుగుతున్న పనులపై వివరాలు అడిగి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతమున్న రిజర్వాయర్ల నీటి సామర్థ్యం, ఆయకట్టు వివరాలను కూడా సీఎంకు వారు వివరించారు. ఎర్రబల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు, గిడ్డంగివారిపల్లె డ్యామ్ పనులు, యురేనియం కార్పొరేషన్‌కు సంబంధించిన భూములకు సాగునీరు అందించే విషయంపై కూడా శ్రద్ధ వహించి త్వరగా కార్యరూపం దాల్చేలా చూడాలన్నారు. జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్‌లో భాగంగా చక్రాయపేట మండలంలోని కాలేటివాగు రిజర్వాయర్ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ తదితరులు

కడప రూరల్ : కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తుల లక్షణాలు కలిగిన వారిని గుర్తిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. ఈ కార్యక్రమం 21 రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీకర్, డెమో ప్రమీల, డాక్టర్ వీవీ మనోహర్, డీపీఎంఓ లక్ష్మీపతి, ఏఎంఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదం: రూ.30లక్షల నష్టం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కర్మాగారంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దూది యార్న్, ఫర్నీచర్ కాలిపోయింది. దీంతో సుమారు రూ.30లక్షలకుపైన ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడ ఉన్న సిబ్బంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని కంపెనీ అధికారులు తెలిపారు.

ఫిర్యాదులపై స్పందించాలి



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

లారీ, బైక్ ఢీ : ఇద్దరి మృతి

చెన్నూరు : చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలెంపల్లి సమీపంలోని ఈచర్ షోరూం సమీపంలో ఆదివారం రాత్రి లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు పాలెంపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ (18),కడపలోని సాయిపేటకు చెందిన వెంకట విజయ్ (20)లు బైక్‌లో డాబా వద్దకు వెళుతుండగా ప్రమాదం జరిగింది.వెంకటేష్ ఘటనా స్థలంలో మృతి చెందగా, వెంకట విజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

క్షుద్రపూజల పేరుతో మహిళలను ట్రాప్ చేస్తున్న గ్యాంగ్

ఏడుగురు ముఠా సభ్యుల అరెస్టు



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు పెళ్లి కాని ఆడపిల్లలకు త్వరగా పెళ్లిళ్లు అవుతాయని, ఆరోగ్య సమస్యలున్నా పూర్తిగా నయం అవుతాయంటూ ఓ గ్యాంగ్ మహిళలను మోసగిస్తోంది. ఆర్థిక సమస్యలతో సతమతవుతున్న మహిళలను లక్ష్యంగా చేసుకొని ట్రాప్ చేస్తోంది. అయితే తిరుపతికి చెందిన ఒక మహిళ ఈ ముఠా సభ్యుల చేతిలో మోసపోయింది. ఆమె ఫిర్యాదుతో బాబా అండ్ కో చేస్తున్న మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో గ్యాంగ్‌లోని ఏడుగురిని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఒక మహిళ ఆర్థిక సమస్యలతో బాధపడేది. తన కుమార్తెలకు వయసు వచ్చినా ఇంకా పెళ్లిళ్లు కాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో ఓ బాబా క్షుద్రపూజలు చేస్తే ఆర్థిక సమస్యలతో పాటు కుటుంబంలోని ఇతర సమస్యలు కూడా పూర్తిగా తీరిపోతాయని ఒక మహిళ ద్వారా తెలుసుకున్న ఆమె ముఠా సభ్యులను ఆశ్రయించింది. తిరుపతి మహిళను ఫోన్‌లో సంప్రదించిన మోసగాళ్లు ఆమెను కడపకు రమ్మని చెప్పారు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ముఠా సభ్యులు కొందరు ఆమెతో కడపలో సమావేశం అయ్యారు. అయితే వారు పెట్టిన కొన్ని షరతులకు ఆమె అంగీకరించకపోవడంతో రెండు రోజుల క్రితం తిరిగి వారు ప్రొద్దుటూరులో సమావేశమయ్యారు. ఈ క్రమంలో పూజలు చేస్తామని నమ్మబలికిన కేటుగాళ్లు ఆమెను లైంగికంగా వేధింపులకు గురి చేశారు. దీంతో వారి బారి నుంచి తప్పించుకుంది. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడుగురు నిందితులు అరెస్ట్

ఏఎస్పీ ప్రేరణాకుమార్ ఆదేశాల మేరకు సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్‌లు సిబ్బందితో కలిసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ముఠా సభ్యులు అమృతానగర్‌లో ఉన్నారని తెలియడంతో దాడులు నిర్వహించారు. దాడిలో అనంతపురం జిల్లాకు చెందిన వసారింటి నాగరాజు, కంబగిరి రాముడు, వడ్డే వెంకటేష్, కర్నూలు జిల్లాకు చెందిన మార్కె కంబగిరి రాముడు, మొట్టే కాంతమ్మ, నంద్యాల జిల్లాకు చెందిన జిట్టా రవికుమార్, తిరుపతికి చెందిన పాలిచెర్ల ప్రియలను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. విచారణలో భాగంగా నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు బాబా, మరి కొందరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం..

ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మహిళలను ఈ గ్యాంగ్ టార్గెట్ చేస్తోంది. ఇందుకోసం గ్యాంగ్‌లోని మహిళలను ఏజెంట్లుగా ఉపయోగించుకుంటున్నారు. వారి ద్వారానే అమాయక మహిళలను ట్రాప్ చేస్తున్నారు. క్షుద్ర పూజలకు అంగీకరించిన మహిళలను లొంగదీసుకొని వ్యభిచార కూపంలోకి దింపే ప్రయత్నం జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కాగా ప్రొద్దుటూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల వ్యభిచార నిర్వాహకులతో వీరికి సంబంధం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. వారి వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే వీరి ఉచ్చులో పడి ఎంత మంది మహిళలు మోసపోయారనే దానిపై కూడా పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ యుగంధర్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్, బ్లూకోల్ట్స్ సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్, ఏఎస్పీ ప్రేరణాకుమార్ అభినందించారు.

వర్సిటీ ప్రగతికి ప్రధానభూమిక అధ్యాపకులే



మాట్లాడుతున్న వైవీయూ వీసీ చింతా సుధాకర్

వైవీయూ : బోధన, పరిశోధనలు ప్రభావవంతంగా కొనసాగితే విశ్వవిద్యాలయం రాష్ట్రంలోనే మేటిగా నిలుస్తుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూలోని సర్ సీవీరామన్ సైన్స్‌బ్లాక్‌లో ఆచార్యులు, సహ ఆచార్యులు, సహాయ ఆచార్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని భవిష్యత్తులో న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధనకు నేటి నుంచే అంకురార్పణ జరగాలని, ఈ క్రతువులో ప్రధానభూమిక అధ్యాపకులదేనన్నారు. మంచి అకడమిక్ రికార్డు, ఉత్తమ పరిశోధన, జిజ్ఞాస కలిగి, విధుల పట్ల అంకితభావం కలిగిన అధ్యాపకులు మనకు ఉండటం అదృష్టమన్నారు. మన వద్దకు వచ్చే విద్యార్థులను మనకంటే గొప్పవారిగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆధునిక సాంకేతికత ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని, ఎంత సాంకేతికత వచ్చినా గురువుకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుచేశారు. విజయం అనేది గమ్యం కాదని, నిరంతర ప్రయాణం అన్నారు. స్కోపస్ వంటి ప్రముఖ జర్నల్స్‌లో ప్రతి అధ్యాపకుడి పరిశోధన పత్రాలు ప్రచురితం కావాలన్నారు. విశ్వవిద్యాలయ కీర్తి పెంచేలా అందరూ కృషిచేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పరిపాలన పరంగా అధ్యాపకులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి. శ్రీనివాస్ మాట్లాడారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు : బద్రిపల్లె గ్రామంలో అవధూత దిగంబర వీరయ్య స్వామి 46వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు 4046 అడుగుల బండలాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. చక్రాయపేటకు చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి ఎద్దులు 4011 అడుగులతో ద్వితీయ, మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ ఎద్దులు 4000 అడుగులతో తృతీయ, కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ఖాజాహుస్సేన్ పాల్కందొడ్డి ఎద్దులు 3728 నాలుగో స్థానం, ప్రకాశం జిల్లా బురుజుపల్లె ఎర్రమల సోహిత్ రెడ్డి ఎద్దులు 3500 అడుగులతో ఐదో స్థానం, మైదుకూరుకు చెందిన వెంకటరమణారెడ్డి, కుర్ర వెంకటేష్ ఎద్దులు 3349 అడుగులతో ఆరో స్థానంలో, నంద్యాల జిల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, కడపలోని బాలాలయపల్లె ఎద్దులు 3347 అడుగులతో ఏడో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దులకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

కార్పొరేట్ శక్తులకు దేశం తాకట్టు



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పేర్కొన్నారు. సోమవారం కడపలోని పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వం రంగ సంస్థలను అమ్మకాలకు పెట్టిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి గిట్టుబాటు ధరలను రైతులకు ఇవ్వలేదన్నారు.దేశ సంపదను కొల్లగొట్టి అదానీ. అంబానీలకు కట్టబెట్టిందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమకు నిధులను కేటాయించి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చంద్రశేఖర్, రామ్మోహన్, ఐఎన్ సుబ్బమ్మ, మనోహర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

కమలాపురం : పెన్నా నదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. సోమవారం తెల్లవారు జామున పెన్నా నది వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డికి అవార్డు



పులివెందుల రూరల్ : పట్టణంలోని ఏపీ కార్ల్ సీఈఓగా పనిచేస్తున్న రమణారెడ్డి న్యూఢిల్లీలోని రిఫా సిమెంట్ ఇంటర్నేషనల్ సంస్థ ఏషియన్ అడ్మైరబుల్ అచీవర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పశు పోషణ విభాగంలో 22ఏళ్లుగా చేసిన కృషికి రిఫా సిమెంటు ఇంటర్నేషనల్ సంస్థ ఈ అవార్డు ఇచ్చిందని చెప్పారు. 22ఏళ్లల్లో 150పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రికల్లో ప్రచురించారన్నారు. పరిశోధనకు సంబంధించి ఇప్పటివరకు 15దేశాలను సందర్శించినట్లు చెప్పారు.

చీటీల పేరుతో మోసం

కడప రూరల్ : నమ్మకంగా ఉన్నట్లు నటించి చీటీలు వేస్తున్న వ్యక్తి పరారయ్యాడు. దీంతో తమ భవిష్యత్ కోసం కూడబెట్టిన డబ్బును పోగొట్టుకున్నామని, తమకు న్యాయం చేయాని పోరుమామిళ్లకు చెందిన బాధితులు రఘురాములు, నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా ఎస్పీకు ఫిర్యాదు చేసిన అనంతరం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు.పోరుమామిళ్ల మండలం రంగ సముద్రం పంచాయతీకి చెందిన చిన్న ఓబులేసు చీటీలను నడుపుతుండేవారన్నారు. అతను 2016 నుంచి నమ్మకంగా ఉంటూ రూ. లక్షల్లో చీటీలు వేస్తూ ఉండేవారని పేర్కొన్నారు. చీటీల రూపంలో తమకు రూ 30 లక్షల చొప్పున బాకీ ఉన్నారని తెలిపారు.



ఏఎఫ్‌యూలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షలను తనిఖీ చేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని టౌన్‌ప్లానింగ్, బిల్డింగ్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీస్ మేనేజ్‌మెంట్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ ఆఫ్ ఫైన్ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్, స్కల్ప్చర్, ఆర్ట్‌హిస్టరీ విభాగాలకు 4వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా ఇ.సి. సుప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

కడప అర్బన్: కడప నగర శివార్లలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ సయ్యద్ మున్ని (36) అనే మహిళ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మార్చురీలో వుంచారు. ఆమెకు సంబంధించిన బంధువులు ఎవరైనా వుంటే తమను సంప్రదించాలని కడప రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు సోమవారం తెలియజేశారు.



రైతులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : వ్యవసాయపరంగా రైతుల పురోగతికి శాస్త్రవేత్తలు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని(కేవీకే) సందర్శించారు. కేవీకే, ఏరువాక, వ్యవసాయ పరిశోధన స్థానం సాంకేతిక కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కి పాటుపడాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆచరించాల్సిన పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల గురించి తెలుసుకున్నారు. జిల్లాలో పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. కేవీకే నమూనా క్షేత్రాని సందర్శించారు. అందులో ఉన్న వివిధ విభాగాల యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్ర సమన్వకర్త మురళీకృష్ణ, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి మాట్లాడారు.

21న రౌండ్‌టేబుల్ సమావేశం : ఎన్నో ఏళ్లుగా రైతులు సాగు చేసుకుంటూ, వారసత్వంగా సక్రమించి అనుభవంలో ఉన్న చుక్కల భూములపై హక్కులు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఈ విషయమై 21వ తేదీన కడపలోని ప్రెస్‌క్లబ్‌లో రైతు సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోట వీధికి చెందిన యనమల బ్రహ్మయ్య(22) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కథనం మేరకు పెళ్లి చేయలేదనే ఆవేదనతో ఈ చర్యకు పాల్పడినట్లు మృతుడి తండ్రి బ్రహ్మయ్య తెలిపాడన్నారు.. మృతుడు కువైట్‌కు వెళ్లేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాడు.ముందుగా తనకు పెళ్లి చేయాలని పట్టుబట్టాడు. కువైట్ పంపించేందుకు డబ్బు ఖర్చు అయిందని, అక్కడికి వెళ్లి డబ్బు సంపాదించి వస్తూనే పెళ్లి చేస్తామని తండ్రి చెప్పినా వినలేదు. ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడ్డాడు.తర్వాత చీర తీసుకెళ్లి ఉరి వేసుకున్నాడు., సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.